
# సుబ్బయ్య సంధ్యారాగం



'ఇదిగో ఏమేయ్, ఎవరింట్లో?—ఎంకీ!'

'ఆ, బాబుగారా! అమ్మగారు పెరటిలో తులసిపూజ చేస్తున్నారండీ'

'మౌనవ్రతంలో ఉందా? ఇంట్లో అడుగు పెట్టింది లగాయతు ఒకటే వ్రతాలూ, ఒకటే నోములూను, పాడు పచ్చికొయ్య దేహం శుష్కిస్తుందనికూడా తెలియదు. తొందరగా కానివ్వమని చెప్పు. మళ్ళా పొలం వెళ్ళాలి.' సుబ్బయ్య దగ్గరనే వున్న పడకకుర్చీలో వాలాడు. చుట్టముట్టించి, పొగజోరు చేశాడు.

'ఆ పొగ కాస్త తగ్గించండీ, ఎప్పుడూ పాడు చుట్టలేనా, కాస్తపడీ, ఆచారం, నాగరికతా ఉండాలి' అని నవ్వుతూ శాంత ప్రసాదం అందించింది. సుబ్బయ్య చుట్ట అవతల పారవేసి ఆపళంగా ప్రసాదం తినబోయాడు.

'ఆ, ఆ, తప్పు తప్పు, కళ్ళకద్దుకోకుండానే' అంది చిరునవ్వుతో, కొంచెం హెచ్చరికగా.

సుబ్బయ్య ఆమెకేసి చూస్తూ 'చూడుపిల్లా! గుమ్మం త్రొక్కింది మొదలు ఒకటే వ్రతాలూ, నోములూ. పసిదానివి ఇంకా ఎంతో ముందుకు పోవాల్సిన దానవు. నీ సుకుమారమైన దేహాన్ని యిలా నాశనం చేసుకుంటా వెందుకు? - అద్దం యిలా పట్టుకరా, నీ కళ్ళు ఎంత లోతుకు పోయాయో చూపిస్తాను. ఏం వయసు చెల్లిన దానవా మోక్షమార్గాలు వెతకడానికి? చాల్లే గాని కాస్త దేహాన్ని పోషించుకో. తన్నుమాలిన ధర్మం మొదలు చెడ్డబేరంలాంటిదన్నారు పెద్దలు.'

ఆమె చిరునవ్వు నవ్వింది. 'ఏదో గొప్ప ప్రతిఫలాన్నాశించకుండా చేస్తున్నాననుకున్నారా? ఏదో నా నోములు ఫలించి మన యిరువురికీ కలుసు—' సిగ్గునభినయిస్తూ అన్నది.

సుబ్బయ్య సంతోషంపొంగి, పొరలి నవ్వుగా బయటకు వచ్చింది. 'అదా సంగతి. కానివ్వు, నీ వ్రతాలు నిరాఘాటం కానివ్వు. కానిదేహాన్ని మాత్రం కాపాడుకో. చూడూ, ఏదీ నీ చెక్కిలి' అన్నాడు బొర్ర నిమురుకుంటూ.

'అయ్యో, మడికట్టుకున్నాను. తాకబోకండీ, క్షమించండి' అన్నది శాంత.

'ఆ, పిల్లలు ఎక్కడికి వెళ్ళారు? అన్నం తినే వెళ్ళారా? వేళకు అన్నం తింటున్నారా?'

'ఇప్పుడే యింతకు ముందుగానే భోంచేసి బయటకు వెళ్ళారు. చూడండి నా గొంతుకలో వూపిరి వున్నంత వరకు వాళ్ళకు ఏ లోటు రానివ్వను.'

'నేను అన్నాననటే పిచ్చికొయ్యా, నీవిషయం నాకు తెలియదూ? సరేకాని పొలంనుండి చచ్చి చెడి వచ్చాను. ఆకలి దహించుకపోతోంది త్వరగా కానివ్వు.'

'బావుందండీ, మీకోసం గంటనుండికని పెట్టుకొని కూర్చున్నాను త్వరగా స్నానంచేసి రండి, అన్నం చల్లారిపోతోంది.'

సుబ్బయ్య బండి చక్రమంత అరటాకు విస్తరిలో నెల్లూరు బియ్యపు అన్నం, వంకాయ కూర, కందిపప్పూ, చేరెడు నేయీ, ముంతెడు

“వసశ్రీ”

పెరుగుతో భోజనం చేశాడు. శాంత తాంబూలం రెడీచేసింది. సుబ్బయ్య పొగత్రాగుతూ కూర్చున్నాడు. పొగ వలయాలుగా తేలిపోతూ, అతని ముఖాన్ని కప్పివేసింది.

'నిజంగా, శాంత ఎంత మంచిపిల్ల, ఎంత అందమైన పిల్ల. అంత గుండ్రమూ, అంత కోలా కాని ముఖం, చేరడేసి కళ్ళూ, సంపెంగపూవు లాంటిముక్కూ, తీర్చిదిద్దిన కనుబొమలు చామన చాయ' - అచ్చగా ఒక కవి వర్ణించే ప్రబంధ సుందరి.

సుబ్బయ్య ఒక్కసారి తన దేహానికేసి చూసుకున్నాడు. సర్వసహ్యంగా వుంది. ఆమెతో తనకెక్కడా పోలికే లేదు. నిజంగా తనెంతో అదృష్టవంతుడు. తన పూర్వ జన్మ సుకృతం వల్లనే తన కిలాంటి పుత్తడి బొమ్మను భగవంతుడు ప్రసాదించాడు. అదే తన సర్వస్వం. పాలఘాటు పిల్లకు యింత వినయమూ యింత విధేయతా వుంటాయా? ఏమి వ్రతాలూ... సంతానమట... సంతానం... సుబ్బయ్యకు నవ్వు వచ్చింది. వూరిలో ప్రతివారు తనను అదృష్టవంతుడనంటే, అదృష్టవంతుడ వంటున్నారు. కాకపోతే కాటికి కాళ్ళు చాచుకున్న తన్ను పెళ్ళాడుతుందా? పెళ్ళాడిం దనుకో యింతగా కండ్ల కద్దుకొని పూజిస్తుందా?... పిల్లలు... ఆ పసివాళ్ళమీద ఎంత ప్రేమ? ఎప్పుడూ చిన్నవాడు దాని మెడ పట్టుకొని వూగులాడుతున్నాడు. ఎంత చనువు. అన్నట్టు మెడబోసి కొడుతున్నది. పాపం నగలూనట్రా ఏమి చేయించమనదు. సిగ్గుకాబోలు. రేపే కమసాలితో మాట్లాడుతాను. ఒక రంభలాగా తయారుచేస్తాను. సుబ్బయ్యను నిద్రాదేవత పట్టుకుంది.

వయసుతోపాటు సుబ్బయ్య మనసుకూడా పండిపోతున్నది. దానిలో యిప్పుడు కఠినత్వం అంటూయేమీ లేదు. అంతా ప్రేమ. ప్రపంచం అంతా ప్రేమ. అది వెన్నవలె మెత్తగా వుంటుంది. కరుణ, జాలి దానికి పెట్టిన ఆభరణాలు. శాంత మాటాడితే అదొక మెఱపు తీవె. ఆమె సంతోషం ఒక పండుగ. అలాంటప్పుడు అతని పేద హృదయం శాంత ప్రతి అవయవాన్ని ప్రతి నరాన్ని ఎలా పరీక్షింపగలుగుతుంది.

తెలియకుండానే రోజులు దొర్లిపోతున్నాయి. రోజూ యీ విధంగానే జరుగుతుండేది. గృహస్థులు సన్యాసులయ్యారు. లోభులు దానకర్ణు లయ్యారు. పతివ్రతలు వ్యభిచరించారు. సర్వం మార్పు... సుబ్బయ్యగారింట్లో ధాన్యం మాయమౌతున్నది. ఎవరు కారకులు? శాంతా? ఛీ,ఛీ ఆమెనంటే మహా పాపం వస్తుంది. ఆమె మహా యిల్లాలు. గృహిణి తన యింట్లో వస్తువులు తాను దొంగిలిస్తుందా? దొంగిలి ఎవరి కిస్తుంది? పోనీ ఎంకి యేమన్నా ధాన్యం దొంగిలి అమ్ముతున్నదా? ఔను నిజంగా అదే. అది పచ్చి దొంగ.

ఎంకికి యింటిలోనుండి వుద్వాసన జరిగింది. సుబ్బయ్య కేవలం పసిపాపయి పోతున్నాడు. సదసద్వివేచన జ్ఞానం నశించింది.

ఇంకా కొన్ని రోజులు తోసుకుంటూ వెళ్ళాయి. సుబ్బయ్యగారి యిల్లు యిప్పుడు ఎంతో సందడిగా వుంటూవచ్చింది. రోజూ చుట్టాలే. శాంత బంధువులే. శాంత అన్నలూ తమ్ముళ్ళూ, మామలూను. ఒక్కొక్కరు దయచేసి నెల్లాళ్ళు తిష్ఠవేస్తారు, మరికొందరు రాత్రి పూట వస్తారు. ఆ రాత్రిమాత్రమే వుంటారు, అదేం చిత్రమో. కాఫీలూ, యిడ్లీలూను ప్రతి ఉదయం.

శాంత యీమధ్య కొంత అధికారం తీసుకుంటున్నది. సుబ్బయ్యను కొంచెం విసుక్కుంటున్నది. తప్పేమీ లేదు. విడ్డూరం లేదు. రోజులు గడిచేకొద్దీ ఏ యిల్లాలికైనా కొంత చనువు, కొంత అధికారం లభిస్తుంది. శాంతలో కూడ అంతమాత్రపు మార్పే! సుబ్బయ్య ఆలోచించ గలిగింది యీ మాత్రమే. కాని లోకం గుసగుసలు పోతున్నది. శాంతకు రాక్షసత్వం కట్టిపెడుతున్నది.

ఇంకా కొన్నిరోజులు గడిచాయి. శాంతలో యిరువదియేడుల యౌవనం దోబూచు లాడుతోంది. ఆమె యిప్పుడు అలంకరించుకోవడం మీద ఎక్కువ మోజు చూపుతున్నది. సన్నని వులిపిరి చీరలనే కట్టుతోంది. చీరలోంచి దేహం చాలావరకూ అగుపిస్తోంది. ఒక్కొక్కప్పుడు పక్షోజాలమీద అచ్ఛాదనే ఉండదు. బొట్టు కూడ పెట్టుకోవడం లేదేమిటి విచిత్రం! కాపు

రాసికి వచ్చిన క్రొత్తలో ఎంతో దైవభక్తి, ఎంతో పతిభక్తి, సిగ్గు చూపేదికదూ! ఇప్పుడు పగవాళ్ళలోకి స్వేచ్ఛగా వస్తోందే...కలుపుగోలుతనం కాబోలు!

ఆరాత్రి సుబ్బయ్య వసారాలో పండుకున్నాడు. నిద్రపట్టడం లేదు' ఈమధ్య కొంత వుబ్బసం దగ్గు కూడా పట్టుకుంది. ఎప్పుడూ దగ్గుతుంటాడు. మనిషి బక్కచిక్కి పోయాడు. దగ్గరగానే పిల్లలు నిద్రపోతున్నారు. వాళ్ళ వంటి మీద గుడ్డ కూడా లేదు. పాపం చలిలో ఎంత బాధపడుతున్నారో? సుబ్బయ్య తనవద్ద బట్ట తీసుకవెళ్ళి పిల్లలకు కప్పి మళ్ళీవచ్చి మంచం మీద వాలాడు. శాంత ఏంచేస్తోంది చెప్మా? లోపల దీపం మినుకుమినుకు మంటోంది...ఆఁ ఏమిటది? ఒకటి, రెండూ, మూడూ...ఎవరో ఏదో ఎంచుతున్నారే!...ఒక్కక్షణం... ...ఎవరో మొలపంచ సర్దుకుంటూ వెళ్లారు... ఇంకొక క్షణం...ఎవరో లోపలికి వస్తున్నారు. సుబ్బయ్య దొంగ అనుకున్నాడు. భయంతో బొంగురుపోయిన గొంతుతో దొంగ, దొంగ అని అరిచాడు. పిల్లలు ఉలిక్కిపడి లేచారు. లోపలనుండి శాంత 'అయ్యో కంగారుపడ్డారు కాబోలు. వారు మా అన్నయ్యగారు. రాత్రి వచ్చారే, వారు. దాహం అయింది కాబోలు. రా, అన్నయ్యా రా' అంటూ ప్లాటుభంగం అయినందుకు విచారిస్తూ, అతడికి దాహం యిచ్చి, అయ్యో గాలిలో పడుకున్నారే, అంటూ సుబ్బయ్యనూ, పిల్లలను లోపలకి తీసుకువెళ్ళింది.

దాహంతీరి కూడా, తీరని ఘరానా మనుష్యుడు నిరాశతో యిది సమయంకాదనుకుంటూ నిష్క్రమించాడు. 'కొన్ని రోజులు గడిచాయి' సుబ్బయ్యకు ఒక్కరాత్రి సమయాల్లో వినా పగల్లూ మైకం కమ్ముతున్నది. దగ్గు ఎక్కువైంది. ఆదాయం కుంటుపడ్డది. పొలం పనులు బుగ్గి అయ్యాయి. రెక్కాడితేకాని డొక్కాడటంలేదు. పిల్లలు కృశించిపొయ్యారు.

ఒకరోజు సుబ్బయ్యదొరగారు యీనాడు సుబ్బాయిగారు, లేదా బొర్రాయనగారు, శాంతకు 'ముసలాడు'...కాని పిల్లలకు నాన్నగారు.

రోజులు గడిచాయి. ఆ రోజు శుభలేఖతో ఒక ఘరానామనుష్యుడు వేంచేశాడు. ఇంట్లో కలకలం...శాంత సుబ్బయ్యదగ్గరికి వచ్చింది. వినయంతో 'చూడండీ' రేపు పంచమినాడు మా రెండోతమ్ముడి పెండ్లట. మన మందరము రావాలంటూ మా పెద్దన్నగారు వచ్చారు. అంగీకరించరూ' అంది. కాళ్లు పట్టుకుంటూ. సుబ్బయ్యకు మైకం. 'సరే నేనుమాత్రం రాలేను. నువ్వు వెళ్ళి మరలా యిక్కడవున్నట్టే రావాలి బెంగుళూరు ప్రయాణం సుమా—ఎలా వెడతావో - క్షేమంగాపోయి లాభంగా తిరిగిరా' అన్నాడు చిబుకాన్ని సవరించబోతూ.

'నేను తిరిగి వచ్చేదాకా మీకు ఏ కొరత రాకుండా పక్కింటి రామమ్మగారి యింటిలో ఏర్పాటుచేశాను' అన్నది శాంత.

ప్రయాణం నాడాయిడి. శాంత యింటిలోని నగలూ నట్రా అంతా అలంకరించుకుంది. కూడబెట్టిన అయిదువందల రూపాయలూ తీసుకుంది. జై పరమేశ్వరా! అని బయలుదేరింది.

* * *

రోజులు గడిచాయి. శాంత తిరిగి రాదేమి చెప్మా? శాంత లేచిపోయిందంటే లేచిపోయిందని-యీ ముసలాడితో ఆ భోగంపిల్ల ఎక్కడ కాపురం చేస్తుందని, ఏమి వినయమున్నా అతి వినయం ధూర్తలక్షణమని, వూరంతా దుమ్మెత్తి పోస్తున్నారు. పరాత్పరా యీ ముసలితనంలో యీ బెడద తీసుకవచ్చి పెట్టావా? ఈ జీవితం యింక ఎలా తెల్లవారుతుంది?

అప్పులవాళ్లు వేధిస్తున్నారు. కొన్నాళ్ళకు రామమ్మ సంఘానికి వెరచి సుబ్బయ్యకు అన్నం వండిపెట్టడంకూడా మానుకుంది. సుబ్బయ్య యీ అవమానం భరించలేక పోయాడు.

* * *

పోస్టుమన్ పిలుపు - టెలిగ్రామ్: సుబ్బయ్య చదివించాడు అందులో శాంత అడ్రసుమాత్రమే వుంది.

'మిస్ శాంత. విలాసగృహం, పీటర్సురోడ్ బెంగుళూరు.'

సుబ్బయ్య వెంటనే బయలుదేరాడు. రామమ్మ పుణ్యాన కట్టుకొని ఒక నూరురూపాయలిచ్చింది.

ఎలాగైతేనేం విలాసగృహం ఉనికి కనిపెట్టగలిగాడు సుబ్బయ్య. ఒక్కక్షణం. ఎవరీ అతిథు

లంతా! శాంత ఏదీ! ఇది యేదన్నా సినిమా హాలా! నాట్య ప్రదర్శనమా! శాంత అగుపడితే బుద్ధి చెప్పి ఇంటికి తీసుకవెళ్ళాలి!

'ఇంకొక క్షణం

'ఎవరది? శాంతే, నా శాంతే! అసభ్యం... ఏమిటిది? అసభ్యంగా నృత్యం చేస్తోందే! వీళ్ళందరి ముందర' ఇంకా కొంతమంది స్త్రీలు నాట్యం చేస్తున్నారు. రామరామ... ఛీ ఛీ...శాంతా, అని పిలుద్దాం అనుకున్నాడు సుబ్బయ్య. పక్కనే వున్న మనుష్యుడు తనకన్నా ముందుగానే లేచి శాంతా, నన్ను అన్యాయం చేశావు నా కాపురం కూలదోశావా? అంటూ యేడుస్తున్నాడు. ప్రక్కవాళ్లు అతనినోరు మూస్తున్నారు.

'శాంత! రాక్షసి! ఎంతమంది పచ్చని కాపురాలు యిలా కూల్చిందో! అయ్యో, నా దురదృష్టమా! నాకీ ముసలి తనంలో ఈ పెండ్లేమిటి!, సుబ్బయ్య సినిమాగృహంనుండి బయట పడ్డాడు. బెంగుళూరు నీరుపడక సుబ్బయ్య దగ్గు భరింపరానిదయింది. మృత్యువు ఎదురుచూస్తోంది. సుబ్బయ్య మద్రాసులో దిగాడు. రోడ్డువెంబడి తూలుతూ పోతున్నాడు. ఓయి భగవంతుడా, యీ పాడుజీవితాన్ని సమాప్తం చేయలేవా... దేవుడు మొర ఆలకించాడు కాబోలు, సుబ్బయ్య మీదుగా ఓ లారీ దొర్లుకు పోయింది. అంతే. అతడికిక శాంత లేదుగాని శాంతి లభించింది.

# మార్గసంధి

జాన్ వార్డ్

ఇటీవల నేనొక రైలు ప్రయాణం చేశాను అందరం రైలు ప్రయాణాలు చేస్తూనే ఉంటాం. కాని, ఈ ప్రయాణంలో కొంత ప్రత్యేకత ఇమిడి ఉంది. అసలు నేనీ వ్యాసం రాయడానికి ముఖ్యకారణం ఆ ప్రయాణమే.

నా గమ్యస్థానం చాలాదూరం. నాకేమీ తోచక రైలుపెట్టెలో కూచుని కిటికీ గుండా బయటికి చూస్తున్నాను. ఇలా చూస్తూండగా ఒకటి గమనించాను. మా త్రోవలో పట్టణాలు తప్ప మరేమీ కనిపించడం లేదు. రైలు ఒక పట్టణం దాటిందో లేదో మరో పట్టణంలో అడుగు పెట్టూంది. ఈవిధంగా గంటలు తరబడి జరుగుతూనే ఉంది. ఎక్కడ చూచినా ఫ్యాక్టరీలు, పొగ గొట్టాలు, ఇరుకు సందులు, ఒకదానిపై నొకటి క్రిక్కిరిసి వున్న ఇండ్లు. వీటికి అంత మెక్కడ? మట్టిని చూస్తామన్నా కనిపించదు. ఇవన్నీ అటుంచి, అక్కడ నివసించే ప్రజల్ని చూస్తే జాలేస్తుంది. వాళ్లు పట్టణంలో సుఖంగా జీవించలేరు. పట్టణంవదిలి వెళ్ళనూలేరు.

వీటన్నిటిని గురించీ ఆలోచిస్తూ విచారపడుతూంటే, వార్తా పత్రికలో ఒక వ్యాసం కనిపించింది. మన జాతీయ జీవితంలో శాస్త్రం (సైన్సు) ముఖ్యపాత్ర వహించాలనీ, అలా చేయడానికి మనమంతా కృషి సల్పాలని ఈ వ్యాసకర్త ఉద్దేశ్యం. 'మనజాతియొక్క పారిశ్రామిక పురోభివృద్ధికై, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని గురించిన పాత అభిప్రాయాలన్నిటినీ మార్చుకొనడానికి సంసిద్ధులుగా ఉండాలి మనం' అంటాడు రచయిత.

ఈ రచయిత ప్రకారం, పెద్దపెద్దవి ఇప్పుడున్న వాటికంటె శక్తివంతమైనవి, కొత్త రకమైన యంత్రాలతో నిండిన పారిశ్రామిక కేంద్రాలను నిర్మించడం ఇప్పటి మన కర్తవ్యం అన్నమాట. వీటిఫలితం, యూరపుకంతకూ మన దేశం ఒక ఫ్యాక్టరీగా తయారవుతుంది.

ఈవిధంగా ఆలోచనా పరంపరలు దొర్లిపోతూన్నాయి మనస్సులో. కాని ఒకటిమాత్రం నిశ్చయం. ఏమైనాసరే, నా మాతృదేశం ఒక ఫ్యాక్టరీగా తయారుకావడం నేను సహించలేను. నా దేశమే కాదు. ఏ దేశమైనా సరే అలా జరగడానికి వీలులేదు. 'దేశమంటే మట్టి కాదోయి దేశమంటే మనుజులోయ్' అన్నట్లు, దేశమంటే ఫ్యాక్టరీ కాదు. ఎక్కడైతే ప్రజలు సుఖ